జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



లబ్ధిదారులకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం ఎంతో సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. ఆనందపురం పంచాయతీ, పొడుగుపాలెం, దండువారి కళ్లాలు, ఎస్సీ కాలనీలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ సుదీర్ఘ పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజలు కష్టాలను కళ్లారా చూశారని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ కష్టాలను తుడిచే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు పరుస్తున్నారన్నారు. అన్ని వర్గాల వారి ప్రయోజనాలను పరిరక్షించే విధంగా సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజలను ఏ మాత్రం పట్టించుకోని వివిధ పార్టీల నాయకులు ఎన్నికలు సమీపిస్తుండడంతో మరలా వస్తున్నారని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమివ్వడం వల్ల నేడు రాష్ట్రంలో ఉద్యోగావకాశాలు గణనీయంగా పెరగడంతోపాటు అందరూ ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందించడం దేశ చరిత్రలో ఎక్కడా లేదన్నారు. నాలుగున్నర సంవత్సరాల్లో ఆనందపురం పంచాయతీలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు రూ.75 కోట్ల నిధులు ప్రభుత్వం అందించిందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల లబ్ధి వివరాలతో కూడిన కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చందక లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, చందక సూరిబాబు, చందక అప్పలస్వామి, షిణగం రామారావు, డి.వి.నారాయణ, చందక అప్పలనాయుడు, భాగం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామాగ్రి ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకొచ్చారు. అనంతరం అభిషేకాలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' విజయవంతానికి కృషి

భీమునిపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతం చేసేందుకు అందరూ సహకరించి, కృషి చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోనూ పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందివ్వాలన్న గొప్ప ఉద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అందరూ కలిసికట్టుగా అన్ని ప్రాంతాల్లోనూ వైద్య శిబిరాల విజయవంతానికి కృషి చేయాలని కోరారు.

విజయ గణపతికి సహస్ర కమలార్చన



సహస్ర కమలాల మధ్య విజయ గణపతి

మధురవాడ: మధురవాడ గణేష్‌నగర్‌లోని శ్రీ విజయ గణపతి పంచాయతన దేవాలయంలో శుక్రవారం 1108 కమలాలుతో అర్చన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సూర్యోదయం నుంచి స్వామికి పంచామృత అభిషేకాల అనంతరం కమలార్చన చేశారు. ప్రధాన అర్చకుడు పద్మనాభ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముగిసిన హిందీ పక్షోత్సవాలు

తగరపువలస: ఈ నెల 14న ప్రారంభమైన జాతీయ భాష హిందీ పక్షోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అకౌంట్స్ అధికారి రేగుళ్ల మల్లికాంబ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.దుర్గాప్రసాద్, ఆదర్శహిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకారాజు, హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యసనాల వల్లే గుండె జబ్బులు



ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో అమెరికా కార్డియాలజిస్ట్ ఆకుల రవి, తదితరులు

ఆనందపురం : వ్యసనాలకు బానిసలవడం వల్లే గుండె జబ్బులు వస్తున్నాయని ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్ తెలిపారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆనందపురం జంక్షన్‌లో గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు మారడం, మత్తు పానీయాలు, ధూమపానానికి అలవాటు పడడం వల్ల గుండెకు నష్టం జరుగుతోందన్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఇటీవలి కాలంలో యువకులు కూడా గుండెపోటుకు గురవుతున్నారని చెప్పారు. ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ అధ్యక్షుడు జంగం జోషి, జిల్లా కార్యదర్శి కె.ఎస్.రావు, ఉపాధ్యక్షుడు రామ కోటేశ్వరరావు, సుధాకర్ రెడ్డి, కోరాడ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస: యువకుల్లో వచ్చే గుండెపోటు గురించి ప్రత్యేక అవగాహన కార్యక్రమం శుక్రవారం సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో నిర్వహించారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా న్యూయార్క్‌లోని ఆర్నోట్ హెల్త్ సెంటర్‌కు చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ ఆకుల రవి అవగాహన కలిగించారు. ప్రతి ఒక్కరూ గుండె పనితీరు తెలుసుకుని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల డీన్ పీవీ సుధాకర్, సూపరింటెండెంట్ సుజాత, కార్డియాలజిస్టులు సుజిత్ కుమార్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కార్డియాక్ అరెస్ట్‌పై అవగాహన కలిగిస్తున్న వైద్యులు

తగరపువలస: ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఆరోగ్య సురక్షపై శుక్రవారం అవగాహన కల్పించారు. నగరానికి చెందిన మెడికవర్ ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డైరెక్టర్ డాక్టర్ హేమంత్‌కుమార్ బెహరా మాట్లాడారు. గుండె సంబంధిత వ్యాధులను సకాలంలో గుర్తించి చికిత్స చేయాలని సూచించారు. విద్యార్థులకు అవగాహన నిమిత్తం హార్ట్ సేవర్స్ పేరుతో సీపీఆర్ శిక్షణను వివరించారు. డాక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ సీపీఆర్ అనేది గుండె కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు చేసే అత్యవసర ప్రక్రియ అని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇప్పించాలని వినతి



భీమిలి తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందిస్తున్న రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి తదితరులు

తగరపువలస: వెనుకబడిన రెడ్డిక సామాజికవర్గ ప్రజలకు బీసీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇప్పించాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి కోరారు. ఈ మేరకు భీమిలి తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం అప్పలరెడ్డి మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి విశాఖ వలస వచ్చిన రెడ్లు చాలా పేదవారన్నారు. ఈ మేరకు వారికి న్యాయం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చిప్పాడ వెంకటేష్, సరగడ నాగిరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, చేట్ల ఎల్లయ్యరెడ్డి, నీలాపు రామిరెడ్డి, నమ్మిచలం తదితరులు పాల్గొన్నారు.

కలశాలతో మట్టి సేకరణ



మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ వాసురాజు, అధికారులు, విద్యార్థులు

భీమునిపట్నం: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం పలు పాఠశాలల విద్యార్థులు కలశాలతో మట్టిని సేకరించి ర్యాలీలు నిర్వహించారు. జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ఛాత్రోపాధ్యాయులు, సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల, మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. డైట్ ప్రిన్సిపాల్ ఎల్.మాణిక్యంనాయుడు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈవో శివరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ దేశం కోసం ఎంతో శ్రమించి తమ జీవితాలను, ప్రాణాలను త్యాగం చేసిన వారిని స్మరించుకునేందుకు మేరా భారత్ – మేరా మట్టి కార్యక్రమం నిర్వహించడం గర్వకారణమన్నారు. పౌరులంతా దేశభక్తి కలిగి ఉండాలని సూచించారు.

రమణికుమారికి అభినందనలు



రమణికుమారిని సత్కరిస్తున్న కోలా గురువులు, తదితరులు

కొమ్మాది: ఎండాడలో గల వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం పేడాడ రమణికుమారిని పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అభినందించి సత్కరించారు. ఇటీవల ఆమెను అంబేడ్కర్ యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలిగా నియమించారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు. పార్టీని నమ్ముకున్నవారికి సముచిత స్థానం లభిస్తుందని కోలా గురువులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, బాబ్జి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఆనందపురం విద్యార్థులు



సంజయ్, దిలీప్ కుమార్



పోటీలకు ఎంపికైన కేజీబీవీ విద్యార్థినులు

ఆనందపురం : మండలంలోని నేళ్లేరులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు, గుడిలోవ విజ్ఞాన్ విహార్ విద్యాలయం విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్టు ఆయా పాఠశాలల యాజమాన్యాలు తెలిపాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన స్వాతి, సునీత, మీనాక్షి, కుసుమ, దీపిక, వెంకటి, యామిని రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. షర్మిల, సునీత, కుసుమ, స్వాతి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. విజ్ఞాన్ విహార్ విద్యాలయానికి చెందిన జి.సంజయ్, పి.దిలీప్ కుమార్ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

మూలకుద్దు ఇన్‌చార్జి సర్పంచ్‌గా రామకృష్ణారెడ్డి



ఉత్తర్వులు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తగరపువలస: భీమిలి మండలం మూలకుద్దు ఇన్‌చార్జి సర్పంచ్‌గా ప్రస్తుత ఉప సర్పంచ్ కొయ్య రామకృష్ణారెడ్డిని నియమిస్తూ జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఎం.వి.ఎ.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సర్పంచ్‌గా ఎన్నికైన కొల్లి పార్వతి ఈ ఏడాది జూలై 30న అస్వస్థత కారణంగా మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో రామకృష్ణారెడ్డికి ఆయన ఉత్తర్వులు అందించారు. భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, కొల్లి కోటి రెడ్డి, కొయ్య అప్పల సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఏసీబీ కోర్టు జడ్జిపై అసభ్యకర కామెంట్లు చేసిన వ్యక్తి అరెస్ట్



నూకరాజు

దొండపర్తి : విజయవాడ ఏసీబీ కోర్టు జడ్జి హిమబిందుపై ఫేస్‌బుక్‌లో అసభ్యకర పదజాలంతో కామెంట్లు చేసిన వ్యక్తిని విశాఖ సైబర్ క్రైం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏసీబీ కోర్టు జడ్జిని దుర్భాషలాడుతూ ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టడంపై పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనిపై నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు డీసీపీ – 1 కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ భవానీ ప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత సహాయంతో ఆ పోస్టులు, కామెంట్లు చేసింది భీమిలికి చెందిన గొలగాన నూకరాజు(34)గా గుర్తించారు. అతడిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.